అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
బుధవారం 12 ఏప్రిల్ 2023
1

నీటి కోసం మూగజీవాల తండ్లాట

కాగజ్‌నగర్ : గత రెండు రోజులుగా ఎండలు మండుతుండడంతో మూగజీవాలు తాగు నీటి కోసం అల్లాడుతున్నాయనడానికి ఈ ఫోటోనే నిదర్శనం. మంగళవారం పట్టణంలోని బాలాజీనగర్‌లో ఒక ఇంటి పై కప్పుపై ఉన్న నీటి ట్యాంక్ నిండి నీరంతా స్లాబ్‌పై ప్రవహిస్తూ పావురాలకు కనిపించడంతో పావురాలు ఆ నీటి వద్దకు చేరి తాగుతున్న దృశ్యం కనిపించింది. దీనిని చూసైనా ప్రతీ ఒక్కరు తమ ఇంటిపై మంచినీటి తొట్టెలు ఏర్పాటు చేసి మూగజీవాల దాహార్తిని తీర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ఉట్నూర్ : మండలంలోని ఘన్‌పూర్ గ్రామపంచాయతీలోని శంబుగూడ గ్రామానికి చెందిన పెందోర్ ఇస్రుకి సీఎం రిలీఫ్ ఫండ్ రూ.18వేల చెక్కును ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, సర్పంచ్ పంద్ర లత మంగళవారం అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అత్యవసర సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఆపరేషన్, ఇతర వ్యాధులకు ఆస్పత్రిలో చికిత్స పొందిన బిల్లులతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మాణిక్ షా, దేవు, శ్యామ్‌రావు, దేవ్‌రావు, లచ్చు, వినోద్ పాల్గొన్నారు.



మహాత్మా జ్యోతిబాపూలే వ్యక్తి కాదు సామాజిక శక్తి

- ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్
- పలుచోట్ల పూలేకు ఘన నివాళులు

నవతెలంగాణ-ఖానాపూర్

మహాత్మా జ్యోతిబాపూలే ఒక వ్యక్తి కాదని సామాజిక శక్తి అని ఎమ్మెల్యే రేఖానాయక్ కొనియాడారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో జ్యోతి బాపూలే జయంతి సందర్భంగా ఆమె పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందరూ చదువుకోవాలనే ఉద్దేశంతో పాఠశాలలు, వసతి గృహాలు కల్పించేలా పోరాడారని తెలిపారు. మహిళలు చదువుకొని అన్ని రంగాల్లో ముందుండాలనే సంకల్పంతో మహిళల విద్యాభ్యాసం కోసం కృషి చేశారని కొనియాడారు. ఆనాటి కృషి ఫలమే ఈ రోజు బడుగు బలహీన జాతులు గురుకులాల్లో చదువుకోగలుగుతున్నారని పేర్కొన్నారు.

ఆదిలాబాద్ అర్బన్ : సిపిఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే 196వ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. బిసి స్టడీ సర్కిల్ ఆవరణలో ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ మత ఛాందసులు మహిళలకు చదువును దూరం చేస్తే విద్య ద్వారానే సమాజాన్ని మార్చాలనే ఆశయంతో బడులు పెట్టి మహిళలు అణగారిన వర్గాల జీవితాల్లో అక్షర జ్యోతులు వెలిగించారని అన్నారు. సనాతన, ఛాందస, మత, సాంఘిక, మూఢ దూరాచారాల నిర్మూలనకు ఉద్యమిస్తూ సమానత్వానికి బాటలు వేసిన సామాజిక వైతాళికుడు, సత్యశోధక్ సమాజ్‌ను ఏర్పరచి సమాజహితం కోసం సర్వస్వం ధారపోసిన శ్రామికుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని కొనియాడారు. ప్రపంచ మేధావిగా కొలిచే అంబేద్కర్ పూలేను తన ఉద్యమ గురువుల్లో ఒక గురువుగా భావించారని గుర్తు చేశారు. నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పూలే ఆశయాలకు తిలోదకాలిచ్చేలా విధానాలను రూపొందిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంక రాఘవులు, అన్నమొల్ల కిరణ్, పూసం సచిన్, జిల్లా కమిటీ సభ్యులు ఎం.గంగన్న, బొజ్జ ఆశన్న, సోమేశ్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్ అర్బన్ : సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం పార్టీ కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మహనీయులు కలలుగన్న సమసమాజం కోసం ప్రజలు చైతన్యవంతులు కావాలన్నారు. దేశానికి పూలే చేసిన సేవలు, త్యాగాలు స్మరించుకోవాల్సిన అవసరముందన్నారు. కుల, వర్ణ, వర్గ, లింగ వివక్షతకు వ్యతిరేకంగా పోరాడిన మహోన్నత వ్యక్తి పూలే అని తెలిపారు. నేటి పాలకులు తమ అధికారమే లక్ష్యంగా పనిచేస్తున్నారని, కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి పబ్బం గడుపుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే.రాములు, నాయకులు మేస్రం భాస్కర్, పట్టణ కార్యదర్శి అరుణ్ కుమార్, పార్టీ నాయకులు కొడప సురేష్, గేడం పొచ్చిరాం, కే. గణేష్, బెజ్జంకి నర్సింగ్, బి.గణపతి, జి. రాజు, సాగర్, మహబూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

నార్నూర్ : మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో మంగళవారం మహాత్మాజ్యోతి బాపూలే 197వ జయంతి వేడుకలను యూత్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ నెల 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా గ్రామ యూత్ సభ్యుల అధ్వర్యంలో రక్తదానం శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు శుభం వాగ్మారే, శ్రీకాంత్, దేవానంద్ పాల్గొన్నారు.

ఉట్నూర్ : సామాజిక ఉద్యమ పితామహుడు, అన్ని వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిబాపూలే ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని ఆర్డీఓ సురేశ్ అన్నారు. పూలే జయంతి వేడుకలను మండల కేంద్రంతో పాటు హస్నాపూర్, శ్యాంపూర్ తదితర గ్రామాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ మాట్లాడుతూ జ్యోతిబాపూలే సేవలు మరవలేనివని, కేసీఆర్ ప్రభుత్వం దళితుల అభ్యున్నతి కోసం అనేక పథకాలు చేపడుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు.

ఆదిలాబాద్‌అర్బన్ : అంధకారపు జీవితాలకు అక్షర జ్యోతులు వెలిగించిన జ్యోతిరావు పూలే 197వ జయంతి వేడుకలను బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం బీసీ స్టడీ సర్కిల్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు గడుగు మహేందర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి రత్నపురం రమేష్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కామ్రే పోశెట్టి, జిల్లా కార్యదర్శి ఆరిఫ్ మీర్జా, ఆదిలాబాద్ అసెంబ్లీ అధ్యక్షురాలు మేస్రం మీనా, ఆదిలాబాద్ అసెంబ్లీ జనరల్ సెక్రెటరీ సిర్ర సంతోష్, జిల్లా మహిళా కన్వీనర్ ప్రేమలత పాల్గొన్నారు.



ఖానాపూర్

ఆదిలాబాద్‌టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కామర్స్ కళాశాలలో మంగళవారం మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆధ్యాపకులు బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం జ్యోతిరావు పూలే చేసిన కృషిని కొనియాడారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జలగం అనిత మాట్లాడుతూ జ్యోతిరావు పూలేను ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జ్యోతిబాపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జగ్రామ్ అంతర్వేది మాట్లాడుతూ మహిళల విద్యాభివృద్ధికి పాటుపడిన మహనీయుడు పూలే అని అన్నారు. బాలికలు పూలే స్ఫూర్తిని అందుకొని విద్యలో ముందుండాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, ప్రతాప్ సింగ్, రడారపు సంతోష్ కుమార్, రమేశ్, నర్సింగరావు, తిరుపతి, విజయ్ కుమార్, దయాకర్, అష్రఫ్ అలీ, సాయి ప్రసాద్, అనిత జ్యోత్స్న పాల్గొన్నారు.

ఆదిలాబాద్ అర్బన్ : పూలే 197వ జయంతి వేడుకలను మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీ స్టడీ సర్కిల్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. పూలే విగ్రహానికి సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు అల్లూరి భూమన్న మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం నాయకులు మేకల మల్లన్న, రాళ్లబండి శంకర్, బండి సుభాష్, వరప్రసాద్, నిమ్మల ప్రశాంత్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ : మహాత్మా జ్యోతిరావుపూలే 197వ జయంతిని మంగళవారం కాగజ్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు తన నివాసంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొంగ సత్యనారాయణ, ముత్తు అశోక్ పాల్గొన్నారు. మండలంలోని అంకుసాపూర్ చౌరస్తాలో ఉన్న పూలే విగ్రహానికి ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు చప్పిడి సత్యనారాయణ ఆధ్వర్యంలో నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండలంలోని కోసిని గ్రామ శివారులో ఉన్న పూలే దంపతుల విగ్రహాలకు సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు జయదేవ్, మార్త సత్యనారాయణ, శివప్రసాద్, రాజయ్య, బి నర్సయ్య, వెంకట్, ప్రకాష్‌లు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పట్టణ పద్మశాలి సేవా సంఘం నాయకులు దాసరి వెంకటేష్, కొంగ సంపత్‌కుమార్, పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌రావుతో పాటు పత్తిపాక శ్రావణ్‌కుమార్, పర్శ చంద్రశేఖర్, గణపరం సంపత్, రమణలు నివాళులు అర్పించారు.

నస్పూర్ : నస్పూర్ మున్సిపల్ పరిధిలో పూలే జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో పూలే 196వ జయంతి వేడుకలు శ్రీరాంపూర్ ఏరియాలోని ఉపరితల గని, నర్సరీ, నస్పూర్ గాంధీ నగర్లో, ప్రగతి మైదానంలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో, ఆర్కె7 గనిలో ఏజెంట్ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. అలాగే బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య ఆధ్వర్యంలో సీసీసీ కార్నర్ వద్ద ఘనంగా నిర్వహించారు.



ఆదిలాబాద్‌అర్బన్ : సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో..



కాగజ్‌నగర్



నస్పూర్

ఫూలే విగ్రహాన్ని ప్రతిష్టించాలి

- కలెక్టర్‌కు బహుజన సంఘాల వినతి



నవతెలంగాణ- మంచిర్యాల

పట్టణంలో మహాత్మా ఫూలే విగ్రహాన్ని ప్రతిష్టించాలని బహుజన సంఘాల నాయకులు జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. మంగళవారం కలెక్టర్ బాదావత్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలోని మెజారిటీ వర్గాల సంక్షేమం కోసం రెండు శతాబ్దాల క్రితమే ఉద్యమించిన మహాత్మ జ్యోతిరావు ఫూలేను సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు గౌరవిస్తారని పేర్కొన్నారు. మెజారిటీ వర్గాల వెనుకబాటుకు కారణమైన కుల దురహంకార దౌర్జన్యాలను తన 'గులాంగిరీ' పుస్తకం ద్వారా తెలియజెప్పడమే కాకుండా సత్యశోధక్ సమాజ్ సంస్థను స్థాపించి మెజారిటీ వర్గాలపై జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరించడానికి నడుం కట్టిన మహాత్ముడు అని అన్నారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకూ పూలే గొప్పతనం గురించి, ఆయన చేసిన త్యాగాల గురించి, సామాజిక న్యాయ ఆవశ్యకత గురించి చెప్పాలంటే మహాత్మా పూలే విగ్రహం పట్టణంలో ప్రతిష్టించాలని కోరారు. బెల్లంపల్లి చౌరస్తాలో ఫూలే విగ్రహాన్ని ప్రతిష్టించాలని, ఆ ప్రాంతాన్ని పూలే చౌరస్తాగా నామకరణం చేయాలని కోరారు. గతంలోనూ ఫూలే విగ్రహ స్థాపన కోసం మంచిర్యాలలోని అన్ని సంఘాల తరఫున వినతిపత్రం ఇచ్చామన్నారు. ఇక ఆలస్యం చేయకుండా సత్వరమే ఫూలే విగ్రహాన్ని ప్రభుత్వ నిధులతో ప్రతిష్టించాలని కోరారు. స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులతో చర్చించి సత్వరమే నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సామాజిక న్యాయ వేదిక కన్వీనర్ రంగు రాజేశం, బీసీ ఐక్య వేదిక నాయకులు కర్రె లచ్చన్న, రాజేశంగౌడ్, కనుకుంట్ల మల్లయ్య, బహుజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గుర్లే శ్రీనివాస్‌కు అధికారుల అభినందనలు

నవతెలంగాణ - చింతలమానెపల్లి

డబ్బా జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల నుండి 10వ తరగతి విద్యార్థులను పరీక్ష రాసేందుకు మండల కేంద్రానికి ఆరు రోజులుగా తీసుకెళ్లిన యూత్ అధ్యక్షుడు గుర్లే శ్రీనివాస్‌ను అధికారులు అభినందించారు. సొంత ఖర్చులతో ఆటోలు ఏర్పాటు చేసి విద్యార్థులకు సాయం చేసిన విషయం తెలుసుకున్న ఎస్ఐ గుంపుల విజయ్, ఎంపిడిఓ మహేందర్, ఎంఈఓ సోమయ్య హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. రోజూ 9కిలో మీటర్ల దూరం తీసుకెళ్లి పరీక్ష రాయడానికి సాయం చేసిన శ్రీనివాస్‌కు విద్యార్థులు, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయంలో పాము కలకలం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం పాము కలకలం సృష్టించింది. ఉదయం 10.30కు ఎప్పటిలాగే రెవెన్యూ సిబ్బంది కార్యాలయానికి వెళ్లారు. కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ గదిలో రికార్డు ఫైళ్ల పక్కన పాము ఉండడంతో వెంటనే సిబ్బంది పాములు పట్టే సాయికి సమాచారం అందించారు. సాయి కార్యాలయానికి వచ్చి చాకచక్యంగా పామును పట్టుకున్నాడు. రికార్డు ఫైళ్లను తొలగించి చూడగా అందులో నాగుపాము కుబుసం కనిపించింది. నాగుపాము కూడా కార్యాలయంలో ఉండి ఉండవచ్చని సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. పట్టుబడ్డ పాము గ్రీన్ వైపర్ (కట్ల చెడుగు) అని సాయి తెలిపాడు. పాములు కనబడితే 9866018741 నెంబర్‌కు సమాచారం అందించాలని సాయి సూచించాడు.

చలివేంద్రం ఏర్పాటు

నవతెలంగాణ-దిలావర్‌పూర్

నర్సాపూర్(జి) మండలంలోని అర్లి(కే) గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రయాణికులు, గ్రామస్తుల దాహార్తిని తీర్చేందుకు మంగళవారం సర్పంచ్ రజినీ సుధాకర్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ యువకులు సహకరిస్తే మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.పద్మజ, ఫీల్డ్ అసిస్టెంట్ ముత్యం పాల్గొన్నారు.

ఆసుపత్రి సందర్శన

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం ఏజెన్సీ డిఎంహెచ్ఓ కుడ్మెత మనోహర్ సందర్శించారు. రోగుల వివరాలు మందుల స్టాక్‌ను పరిశీలించారు. ముఖ్యంగా వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు సిపిఆర్‌పై అవగాహన కల్పించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు. ఆయన వెంట వైద్యులు కిరణ్, రాజమణి, హెచ్ఈఓ నాందేవ్, సూపర్‌వైజర్‌లు సత్తవ్వ, చరణ్‌దాస్, హెచ్‌ఏ కైలాష్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

గొర్రెల లబ్దిదారులు డీడీలు చెల్లించాలి

నవతెలంగాణ - హాజీపూర్

రెండవ విడత గొర్రెల లబ్దిదారులు డీడీలు కట్టాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రమేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రాథమిక గొర్రెల సహకార సంఘాల సభ్యులతో గొర్రెల అభివృద్ధి పథకం రెండవ విడతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డా.రమేష్ మాట్లాడుతూ లబ్దిదారులు సంబంధిత పశు వైద్యశాలలో అన్ని ధృవ పత్రాలు అందించాలని, ఆన్లైన్‌లో అప్లోడ్ చేసుకోవాలని సూచించారు. 75 శాతం సబ్సిడీపై గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ శాంతిరేఖా, సరిత పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్య పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మిషన్ వాత్సల్య పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి బూర్ల మహేష్ తెలిపారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 18 సంవత్సరాల లోపు వయసు కలిగి, ఎలాంటి ఆదరణ లేని అభాగ్యుల కోసం 'మిషన్ వాత్సల్య పథకం' ద్వారా ప్రతి నెల రూ.4వేలు అందుతుందన్నారు. కోవిడ్ ద్వారా తల్లి తండ్రులను కోల్పోయి అనాథలైన పిల్లలకు మాత్రమే వర్తిస్తుందని, జిల్లాలో ఇలాంటి వారిని ఏడుగురిని గుర్తించి ప్రతి నెల రూ.4వేలు జూన్ 2021 నుండి ఇస్తున్నామని పేర్కొన్నారు. కోవిడ్ ద్వారా కాకుండా సాధారణ అనాథలైన పిల్లలకు, పాక్షిక అనాథలైన పిల్లలకు ఈ పథకం కింద లబ్ధిచేకూర్చేందుకు ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు రాలేదన్నారు.

మోడీ, కేసీఆర్ తోడు దొంగలు

- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
- భారీ బహిరంగ సభాస్థలి పరిశీలన

నవతెలంగాణ-నస్పూర్

ప్రధాని మోడీ, సీఎం కేసీఆర్ ఇద్దరూ తోడు దొంగలేనని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క విమర్శించారు. క్యాపిటలిస్టులకు దేశాన్ని మోడీ అమ్ముతుంటే, రాష్ట్ర వనరులను సీఎం కేసీఆర్ ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముతున్నాడని ధ్వజమెత్తారు. శ్రీరాంపూర్ పరిధిలోని ప్రగతి స్టేడియం పాదయాత్ర శిబిరం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర పునర్విభజన హామీల ఊసే ఎత్తకుండా ప్రధాని మోడీ హైద్రాబాద్ వచ్చి రాజకీయ ప్రసంగం చేసి వెళ్లడం ఎవరికి ప్రయోజనం కలిగిందని ప్రశ్నించారు. తెలంగాణలో కెసిఆర్ కుటుంబ పాలన అత్యంత అవినీతిలో మునిగిందని మాట్లాడిన ప్రధాని మోడీ కోల్ ఇండియా సంస్థ ఏర్పాటు చేసి బొగ్గు గనులను స్వర్గీయ ప్రధాని ఇందిరాగాంధీ జాతీయ చేస్తే మోడీ, కేసీఆర్ ప్రైవేటీకరణ చేసి అమ్ముతున్నారని విక్రమార్క మండిపడ్డారు. బిజెపి, బిఆర్ఎస్ పాలకులు ఇద్దరూ కలిసే కావాలని సింగరేణి ఆస్తులు ప్రవేట్‌పరం చేస్తున్నారని తెలిపారు. పార్లమెంట్‌లో బిజెపి తీసుకొచ్చిన ఎంఎండిఆర్(బొగ్గు గనుల ప్రయివేటీకరణ) బిల్లుకు బిఆర్ఎస్ ఎంపీలు అనుకూలంగా ఓట్లు వేసి ఇప్పుడు రాజకీయ లబ్ధి కోసం నిరసనలు చేయడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్ భూములను బలవంతంగా తిరిగి గుంజుకొని వాటిల్లో ప్లాటు చేసి అమ్ముతున్నారని మండిపడ్డారు. టీఎస్పీసీలో మాత్రమే ప్రశ్న పత్రాలు లీకేజీ కాలేదని, సింగరేణిలో రిక్రూట్ చేసిన క్లరికల్ పోస్టుల్లో కూడా పేపర్ లీకేజీలు చేసి వారికి అనుకూలంగా ఉన్నవారికే ఉద్యోగాలు ఇచ్చారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయని తెలిపారు. దేశంలోని అన్ని పార్లమెంటు స్థానాలలో పోటీ చేసే విపక్ష అభ్యర్థుల ఎన్నికలకు అయ్యే ఖర్చు తానే పెడతానని చెప్పిన కేసీఆర్‌కు ఇంత డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేవలం తనకు ఇల్లు తప్ప మరే ఆస్తులు లేవని చెప్పిన కేసీఆర్‌కు పార్లమెంటు ఎన్నికలకు ఖర్చు చేసేంత డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందని నిలదీశారు. తాత, నానమ్మ, తండ్రి ప్రధానులైన సొంత ఇల్లు లేనటువంటి నిజాయితీకి నిలువుటద్దం లాంటి రాహుల్ గాంధీ కుటుంబం ఈ దేశానికి కావాలా? దేశ సంపదను దోపిడీ చేస్తున్న మోడీ, కేసీఆర్ లాంటి వాళ్లు కావాలా? ప్రజలే ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. సొంత ఆస్తులను దేశానికి అంకితం చేసిన గాంధీ కుటుంబమే ఈ దేశానికి మార్గదర్శకమన్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సుమారు లక్ష మందితో నిర్వహించే ఈ భారీ బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున్ ఖర్గే, తెలంగాణ ఇన్చార్జి మాణిక్‌రావు ఠాక్రే, పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. మీడియా సమావేశంలో రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ అజ్మతుల్లా, కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు అన్వేష్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధులు లోకేష్ యాదవ్, డాక్టర్ విజయకుమార్, పీసీసీ కార్యదర్శి కేశవకుమార్ పాల్గొన్నారు.



ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలి : సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథ



నవతెలంగాణ-ఖానాపూర్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా అందరూ పోరాడాలని సిపిఐ -ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కే.రాజన్న, నంది రామయ్య అన్నారు. మంగళవారం మండలంలోని రంగపేట్, కొత్తగూడెం, కొమురం భీం కాలనీలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి మోడీ సర్కార్ అధికారం చేపట్టిన నాటి నుండి పేదల శ్రమను దోచుకుంటూ కార్పొరేట్లకు దేశసంపదను అప్పజెప్తున్నాడని విమర్శించారు. కార్పొరేట్ల బాగోగులు తప్ప పేద ప్రజల సంక్షేమాన్ని మరిచారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వరంగ పరిశ్రమలన్నింటిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పడంలో మోడీ చరిత్ర సృష్టిస్తున్నారన్నారు. రైతు సమస్యలపై ఇచ్చిన హామీలన్నింటిని విస్మరిస్తున్నాడని, దేశ రాజధానిలో రైతులు సమ్మె చేస్తే డిమాండ్స్ పరిష్కరిద్దామని హామీ ఇచ్చి రైతులకు క్షమాపణ చెప్పి వాటిని మర్చిపోవడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి యాజమాన్యాలకు, పెట్టుబడుదారులకు అనుకూల నిర్ణయాలు చేస్తూ కార్మికుల హక్కులపై దాడులు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర యువత మద్యం మత్తులో ఉండడానికి 24 గంటల షాపులు తెరిచి ఉంచే జీవోలను తీసుకురావడం యువతను మద్యం మత్తులో ముంచడమే అవుతుందని మండిపడ్డారు. గిరిజనులకు, గిరిజనేతరులకు వెంటనే హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలపై ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మడావి అంకుష్‌రావు, కుంచపు ఎల్లయ్య, జక్కుల రాజన్న, దాసర్ల సుదర్శన్, అడ్డగట్ల శంకర్, మూషికె శంకర్, కురుమ రాజన్న, మచ్చ శ్రీనివాస్, గోనె లచ్చన్న భుక్య రవి, నంది సమత, సోయం జుగాదిరావు పాల్గొన్నారు.

పారదర్శకంగా డబుల్ బెడ్‌రూమ్ లబ్దిదారుల ఎంపిక

నవతెలంగాణ-కడెం

డబుల్ బెడ్‌రూమ్ లబ్దిదారులను పారదర్శకంగా ఎంపిక చేస్తామని ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. మంగళవారం కడెం, కన్నాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో డబుల్ బెడ్ రూమ్ గ్రామ సభకు కలెక్టర్ వరుణ్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ లబ్దిదారుల ఎంపిక పూర్తి పారదర్శకంగా జరుగుతుందన్నారు. మళ్లీ సర్వే చేసి అర్హులకు న్యాయం చేస్తామన్నారు. ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. జీవో నెం 58 ప్రకారం ఇండ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి పట్టాలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి శ్రీనివాస్‌రెడ్డి, కో ఆప్షన్ మెంబర్ ఎండి రఫీక్, రైతుబంధు సమన్వయ సమితి మండల అధ్యక్షులు నల్ల జీవన్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచ్‌లు, ఎంపిటీసిలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



వికలాంగులకు రాయితీ బస్ పాసులు అందజేత



నిర్మల్: మండలంలోని రత్నపూర్‌కాండ్లి గ్రామంలో ఆర్టీసీ ఆధ్వర్యంలో మంగళవారం వికలాంగులకు రాయితీతో కూడిన బస్ పాసులను డిపో మేనేజర్ సాయన్న అందజేశారు. బస్ పాస్ పొందినవారు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులలో సగం ధరకే ప్రయాణించవచ్చని తెలిపారు. ప్రజలు ఆర్టీసీ బస్సులోనే ప్రయాణించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది లక్క నర్సయ్య, టీవి.రమణ, సర్పంచ్ పీచర లావణ్య శ్రీనివాస్‌గౌడ్, గౌతమ్ పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

నవతెలంగాణ-సిరికొండ

వీఓఏల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు బొడ్డు దత్త్రాత్రి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సురేష్, ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం సంతోష్, మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎస్తేర్ వద్దకు వీఓఏల నిరవధిక సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు గ్రామాలలో వీఓఏలు చాలిచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. న్యాయపరమైన డిమాండ్లను వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ.26 వేల వేతనం ఇవ్వాలని, గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేయాలని,సేర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వీఓఏలు రాజ్ కుమార్, జగదీష్, దేవ్ రావ్, మంజుల పాల్గొన్నారు.

పింఛన్ సమస్యలకు టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఆదిలాబాద్ జిల్లా పింఛన్ దారులకు ఏమైనా సమస్య ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 8186000940కు కాల్ చేసి సమస్యను పరిష్కరించుకోవచ్చని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి కిషన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని వికలాంగులు, వితంతువులు, వృద్ధులు, బీడీ కార్మికులు, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులు, ఒంటరి మహిళలు తదితర పింఛన్ దారులు పింఛన్ సమస్యలు, ఇతర వివరాల కోసం ఈ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ ఫోన్ నెంబర్ అన్ని పని దినాల్లో కార్యాలయ సమయంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

వివక్ష, మతోన్మాదంపై పోరాటమే ఫూలేకు ఇచ్చే నివాళి



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

సామాజిక వివక్ష, మతోన్మాదాలపై నిరంతర పోరాటమే ఫూలేకు ఇచ్చే నిజమైన నివాళి అవుతుందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. ఈ మేరకు మహాత్మా జ్యోతి రావు పూలే 196వ జయంతి సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బీసీ స్టడీ సర్కిల్ ఆవరణలోని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ జ్యోతిరావు పూలే జీవితం నేటి యువతకు స్ఫూర్తి అని, ప్రజలకు ఆదర్శనీయమని అన్నారు. నాటి సమాజంలో మనువాదం, బ్రాహ్మణ ఛాందస వాద దుర్మార్గాలపై పూలే అలుపెరుగని పోరాటం చేశారని అన్నారు. మహిళలకు చదువు నిరాకరించిన మనువాదంపై పోరాటం చేసి తన సతీమణి పూలే సావిత్రి బాయిని చదివించి ఉపాధ్యాయురాలిగా మలిచారని కొనియాడారు. బాలికలకు, వితంతువులకు పాఠశాలలు నెలకొల్పి ఛాందస వాదంపై అక్షర యుద్ధం చేశాడని వివరించారు. సమాజంలో ఉన్న సాంఘిక దురాచారాలపై, మూఢనమ్మకాలపై అవిశ్రాంత పోరాటం చేస్తూ మహిళాభ్యున్నతికి అనిర్వచనీయమైన కృషి చేశారని కీర్తించారు. అయితే ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మళ్లీ ఛాందస భావాలనే విద్యారంగంలో ప్రవేశ పెడుతోందని మండిపడ్డారు. విద్యార్థుల పాఠ్యాంశములలో మార్పులు చేస్తూ నూతన జాతీయ విద్యావిధానం పేర విద్యా కాషాయీకరణ, కార్పొరేటీకరణ, వ్యాపారీకరణకు విధానాలను రచిస్తోందని ఆగ్రహించారు. చదువు కొన్నవాడికే దొరికే సరుకుగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు మహిళా రక్షణా చట్టాలను కాగితాలకే పరిమితం చేస్తూ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై దాడులు రోజురోజుకూ పెరిగిపోతున్న నోరు మెదపడం లేదని అసహనం వ్యక్తం చేశారు. దేశంలో పౌరులు పూలే స్ఫూర్తితో మహిళా రక్షణ చట్టాల అమలు కోసం పోరాడాలని సామాజిక వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, ఉపాధ్యక్షులు ఎం.గంగన్న, సోమేశ్, ఆశన్న పాల్గొన్నారు.

టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో...

మహాత్మా జ్యోతిరావు పూలే 196వ జయంతి వేడుకలను టీఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. నాయకులు జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు మల్యాల మనోజ్, జిల్లా అధికార ప్రతినిధి లింగంపెల్లి ప్రసన్నకుమార్, జిల్లా కోశాధికారి తార రవి, కత్తి గంగాధర్, కల్లేపల్లి మల్లయ్య, మోతేవార్ షమీందర్, మల్యాల స్వామి, బాబు జగ్జీవన్ రామ్ సంఘం అధ్యక్షులు నక్క రాందాస్, టీఎమ్మార్పీఎస్ మహిళా సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తుడుం దెబ్బ ఆధ్వర్యంలో....

మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాలను యువత కొనసాగించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షులు గోడం గణేష్ అన్నారు. మంగళవారం మహాత్మా జ్యోతిరావు పూలే 196వ జయంతిని పురస్కరించుకొని స్థానిక దస్నాపూర్‌లోని బీసీ స్టడీ సర్కిల్ ఆవరణలో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోతిరావు పూలే ఒక సామాజికవేత్త అని సమాజ హితం కోసం ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జిల్లా ఉపాధ్యక్షులు శ్యామ్ రావు, నాయకులు ఆత్రం గణపతి, రాంశివ్, ఆత్రం భుజంగరావు, సలాం వరుణ్, గేడం శివ, సోయం భీమ్ రావు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్:బడుగు, బలహీనవర్గాల ప్రజలకు ఆత్మస్థైర్యం కల్పించి, వారి హక్కుల కోసం పోరాడిన మహనీయుడు మహాత్మా జ్యోతి బాపూలే అని జిల్లా పరిషత్ చైర్మెన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. మంగళవారం ఆయన 196వ జయంతి సందర్భంగా జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్, స్థానిక ఎమ్మెల్యేతో కలిసి ఆయన మహాత్మా జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మెన్ మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల ప్రజల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు, సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిబా ఫూలే అని అన్నారు. దేశానికి మొదటి మహిళా ఉపాధ్యాయురాలిని అందించారని, అంటరానితనాన్ని రూపుమాపడానికి పోరాటం చేశారని అన్నారు. దేశ ప్రజలకు జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని కొనియాడారు. ఆయన జీవిత చరిత్రను, చేసిన సేవలను ప్రతి ఒక్కరూ తెలుసుకొని ఆశయ సాధనకు కృషి చేయాలని అన్నారు. ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ మహాత్మా జ్యోతి బాపూలే 196వ జయంతి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. పేద విద్యార్థులకు చదువు అందాలని, విద్యతోనే అభివృద్ధి సాధ్యమని పూలే భావించేవారని అన్నారు. బాలిక విద్యను ప్రోత్సహించి, సమాజంలో మార్పుకోసం సామజిక విప్లవ తేజస్సు తెచ్చిన పోరాటయోధుడు పూలే అని అన్నారు. జయంతి వేడుకల ద్వారా వారు చేసిన సేవలు, త్యాగాలు, పోరాటాలు గుర్తుచేసుకోవడం జరుగుతుందని, భవిష్యత్ తరాలకు తెలిజేసేందుకు ప్రభుత్వం జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమ సమాజా స్థాపనకు, మహిళల అభివృద్ధికి మహాత్మా జ్యోతిబా పూలే చేసిన సేవలు మరువలేనివని అన్నారు. వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలనీ అన్నారు. సమాజంలో చదువుతోనే అభివృద్ధి సాధ్యమని గుర్తించి బాలికల విద్యా కోసం మొట్టమొదటి పాఠశాలను స్థాపించారని, వారి కృషి ఫలితంగా నేడు మహిళలు ప్రభుత్వ ప్రయివేట్ రంగాలలో రాణిస్తున్నారని తెలిపారు. సంక్షేమ శాఖల ద్వారా ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అమలుచేయడం జరుగుతుందని అన్నారు. స్థానిక బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్ 1, 2, 3, 4, కానిస్టేబుల్, ఎస్ఐ. ఉద్యోగాలకు ఉచిత శిక్షణతో పాటు స్టయిఫండ్, పుస్తకాలను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అంతకుముందు వివిధ కుల సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ అణగారిన వర్గాల ప్రజల అభివృద్ధికి పూలే దంపతులు చేసిన



సేవలను కొనియాడారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి రాజలింగం మాట్లాడుతూ శాఖ ద్వారా నిర్వహిస్తున్న ప్రగతి నివేదికను వివరించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహ్వానితులను అలరించాయి. అనంతరం పలువురికి జిల్లా కలెక్టర్, జెడ్పీ చైర్మెన్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. అంతకుముందు స్థానిక బి.సి స్టడీ సర్కిల్ లో మహాత్మా జ్యోతి బాపులే విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. స్థానిక బీసీ సంక్షేమ కార్యాలయ ఆవరణలో మహాత్మా జ్యోతి బాపులే దంపతులకు, బాబు జగ్జీవన్ రామ్, డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాలకు అధికారులు, కుల సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాలల్లో అదనపు ఎస్పీ శ్రీనివాస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఆర్డీఓ రమేష్ రాథోడ్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సునీత కుమారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, వివిధ కుల సంఘాల ప్రతినిధులు దత్తు, శ్రీనివాస్, సుకుమార్, ఇతర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో...

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతి రావు పూలే 196వ జయంతి వేడుకలను వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్‌లోని ఆ మహనీయుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వివేకానంద ఫౌండేషన్ సభ్యులు సాయి, రాజేందర్, సాయి, ప్రసాద్, అజయ్, సృజన్ పాల్గొన్నారు.

బాసర:మహాత్మా జ్యోతిరావుపూలే నవతరానికి ఆదర్శప్రాయుడని వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ నారాయణ అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నారాయణ మాట్లాడుతూ దేశం గర్వించే గొప్ప మహనీయుల్లో పూలే ఒకరని అన్నారు. అణగారిన వర్గాల విద్యాభివృద్ధి కోసం పోరాడిన గొప్ప సంఘ సంస్కర్త పూలే అని గుర్తు చేశారు. సామాజిక న్యాయం, ధ్యేయం పేరుతో ఉద్యమాలు నడిపి తనవంతుగా సహకరించేవారని అన్నారు. స్త్రీలకు విద్య అవసరాన్ని గుర్తించి వారిని ప్రోత్సహించారని అన్నారు. మూఢ నమ్మకాలపై సమరశంఖం పూరించిన గొప్ప సంఘసంస్కర్త పూలే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

తాంసి:మహాత్మా జ్యోతి రావు పూలే 196వ జయంతి మంగళవారం తాంసి మండల కేంద్రంతో పాటు కప్పర్ల, గిరిగామ గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో జయంతిని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని జ్యోతీ రావు పూలే కూడలిలోని పూలే విగ్రహానికి మాలీ యువజన సంఘం సభ్యులు ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమాన్ని నిర్వహించగా ముఖ్యఅతిథులుగా జెడ్పీటీసీ రాజు, గ్రామ సర్పంచ్ స్వప్న రత్న ప్రకాష్, హాజరై పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. వారితో పాటు బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు వివిధ పార్టీలకు



సంబంధించిన నాయకులు మాలీ సంఘం సభ్యులు నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాలీ సంఘం సభ్యులు అరుణ్ కుమార్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతి రావు పూలే చేసిన సామాజిక సేవలను మనం ఎప్పటికి మరచిపోమని ఆయన అడుగుజాడల్లో యువత నడువాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాలీ యువజన సంఘం అధ్యక్షులు అశోక్, బీసీ సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మాలీ సంఘం సభ్యులు గంగారాం గజానన్, ధనుంజయ్, ఉత్తం, ప్రవీణ్, ఉమేష్ డోలే, రాజు, పొచ్చన్న, వార్డ్ సభ్యులు ఉన్నారు.

ఇంద్రవెల్లి:అక్షర ఉద్యమం చేపట్టి బహుజనుల జీవితాలలో జ్ఞాన వెలుగులు నింపిన మహానుభావుడు మహాత్మా జ్యోతిరావు ఫూలే అని బీఎస్పీ సీనియర్ నాయకుడు కాంబ్లే ఉత్తం, భారతీయ బౌద్ధ మహాసభ అధ్యక్షుడు సావంత్ లహుదాస్‌లు కొనియాడారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ భవనంలో బహుజన, దళిత సంఘాల ఆధ్వర్యంలో పూలే జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవభారత నిర్మాణానికి నాంది పలికిన సామాజిక దర్శకుడని పేర్కొన్నారు. కిందిజాతుల విముక్తి కోసం పోరాటం చేసిన మహానుభావుడని కొనియాడారు. భారతదేశ చరిత్రలో కులాన్ని దాని మూలాన్ని వివరించిన దార్శికుడని, 150ఏండ్ల కిందనే స్త్రీ విద్య కోసం ఆలోచించిన మేధావని కొనియాడారు. పేదల బతుకులు చీకటి నుంచి వెలుగువైపు వెళ్లాలని కోరుకున్న మహానుభావుడని అన్నారు. ఇందులో బీఎస్పీ జిల్లా కార్యదర్శి మీర్జా ఆరిఫ్ బేగ్, దళిత సంఘాల నాయకులు భవలే సత్యానంద్, సోన్ కాంబ్లే జితేందర్, వార్డు మెంబర్ సభ్యులు నాగరాజ్, బాలేరావ్ రాష్ట్రపాల్, సూర్యవంశీ ఉత్తం, కాంబ్లే ఆమోల్, కాంబ్లే సునీల్, సోమోరే విద్యాసాగర్, కాంబ్లే ధమ్మనంద్ పాల్గొన్నారు.

నిర్మల్:పేదప్రజల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిబా పూలే సేవలు మరువలేనివని మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. మంగళవారం జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కలెక్టర్ వరుణ్‌రెడ్డిలతో కలిసి కలెక్టర్ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జ్యోతి బాపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అణగారిన వర్గాల ఆశాజ్యోతి, మహిళా విద్యకు మార్గదర్శకుడు, వెనుకబడిన వర్గాల జీవితాల్లో సమూల మార్పుల కోసం జీవితాన్ని ధారపోసిన జ్యోతిబా పూలే జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని అన్నారు. పూలే ఆశయాలకు అనుగుణంగా, ఆయన చూపిన బాటలోనే సీఎం కేసీఆర్ సారథ్యంలోని తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని అన్నారు. రాష్ట్రంలో ఆడబిడ్డల విద్యాభివృద్ధికి తొలి ప్రాధాన్యం ఇస్తున్నదని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ వర్గాల్లోని బాలికలను విద్యవైపు మళ్లించేందుకు ప్రత్యేకంగా గురుకుల పాఠశాలలతో పాటు ఇంటర్, డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాలలను నెలకొల్పిందని అన్నారు. దేశం కోసం, సమాజ హితం కోసం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కొరకు పోరాటం చేసిన మహానీయుల విగ్రహాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ జ్యోతిబాపూలే ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. ముఖ్యంగా ఆడపిల్లల చదువు గురించి, ఆడవాళ్ళ చదువుకోవాలని, చదువు వల్లనే ఈ సమాజంలో ఆడపిల్లలకు భరోసా ఉంటుందని భావించి, ఆ రోజుల్లోనే స్త్రీవిద్య కొరకు విశేష సేవలు అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ ఎర్రవోతు రాజేందర్, డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కడెం :మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం సామాజిక వేత్త జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ నాయక్, అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ల రమేష్, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు భూక్య రమేష్, సీపీఐ మండల అధ్యక్షులు కోటయ్య, కడెం మాజీ సర్పంచ్ చిట్యాల చిన్నయ్య, అడ్వొకేట్ పసుల రాజలింగం బంజార సంఘం నాయకులు ఇస్లావత్ మోహన్ నాయక్, కొత్తపల్లి రాజేశ్వర్, పాల్గొన్నారు.





ఐఎఫ్‌టీయూ మహాసభల పోస్టర్ విడుదల



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) 7వ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జాతీయ మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకటనారాయణ మాట్లాడుతూ ఏప్రిల్ 16, 17, 18 తేదీలలో భారత కార్మిక సంఘాల సమాఖ్య జాతీయ 7వ మహాసభలు ఆంధ్రప్రదేశ్‌ని తిరుపతి పట్టణంలో జరుగుతాయని పేర్కొన్నారు. అన్ని వర్గాల కార్మికులు ఆ మహాసభలలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. జాతీయ మహాసభలలో అన్ని రాష్ట్రాల నుండి వేలాది మంది కార్మికులు హాజరవుతారని మొదటి రోజైన 16వ నాడు భారీ కార్మిక ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. బహిరంగ సభలో జాతీయ నాయకులు డాక్టర్ అపర్ణ, బి.ప్రదీప్, పి.ప్రసాద్, జాతీయస్థాయి నాయకులు పాల్గొంటారని వివరించారు. అట్టి మహాసభలో కార్మికులు అధికసంఖ్యలో పాల్గొని సభలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతి శీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి దుర్గం కళావతి, జిల్లా నాయకులు పుష్ప, లక్ష్మి, జ్యోతి, శివాని, సువిదా పాల్గొన్నారు.

రంజాన్‌కు ప్రత్యేక ఏర్పాట్లు



నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

ప్రతి ఏటా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఈద్గాలు, మసీదుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రధాన ఈద్గా వద్ద పరిశుధ్య పనులను ఆయన పరిశీలించి, మాట్లాడారు. పండగలు మతాలకతీతంగా శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు. అలాగే ఈద్గాల వద్ద మౌలిక సదుపాయాల కల్పన కోసం ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ఈద్గా వద్ద పరిశుధ్య పనులను పరిశీలించిన వారిలో స్థానిక సీఐ నారాయణ నాయక్, మున్సిపల్ కమిషనర్ రత్నాకర్‌రావు, మున్సిపాలిటీ డీఈ సంతోష్ జాదవ్, ఎస్సై శంకర్, వైస్ చైర్మెన్ ఖలీల్, మున్సిపల్ ఏఈ తిరుపతిలతో పాటు పలువురు నాయకులు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు



నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

పిచ్చికుక్క దాడిలో పలువురు గాయపడ్డ ఘటన మండలంలోని సుర్జాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. మంగళవారం పిచ్చికుక్క గ్రామంలోని విధుల్లో సంచరించి, నలుగురు వ్యక్తులతో పాటు ఒక మూగజీవాన్ని గాయపరచడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. విషయాన్ని గమనించిన స్థానిక యువకులు పిచ్చికుక్కను వెంటాడి చంపడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. చంపిన యువకులను గ్రామస్తులు అభినందించారు.

ప్రయాణ ప్రాంగణంలో పూలే జయంతి వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో మహాత్మ జ్యోతిబా పూలే జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ ప్రాంగణంలోని ఆయన చిత్రపటానికి డిపో మేనేజర్ కల్పన పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పూలే జీవిత చరిత్రను వివరిస్తూ, వారి ఆశయాలను ప్రతి ఒక్కరూ నెరవేర్చాలని సూచించారు. ఆఫీస్ సూపరింటెండెంట్ విలాస్, అకౌంటెంట్ మోహన్, శకుంతల, ట్రాఫిక్ ఇన్‌చార్జ్ శ్రీరామ్, రిజర్వేషన్ ఇన్‌చార్జ్ హుస్సేన్, ఉన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పదో తరగతి పరీక్షలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈనెల 3వ తేది నుంచి ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. చివరి పరీక్ష సాంఘిక శాస్త్రం ముగియడంతో విద్యార్థులు ఉత్సాహంగా బయటకు వచ్చారు. జిల్లా వ్యాప్తంగా 54 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా ఉట్నూర్ పేపర్ బండల్ మిస్సింగ్ తప్ప ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జగలేదు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు. చివరి రోజు పరీక్షకు10,614 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 10,546 విద్యార్థులు హాజరయ్యారు. 68 మంది గైర్హాజరయ్యారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



నవతెలంగాణ-లక్ష్మణచాంద

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీపీ అడ్వాల పద్మరమేష్ అన్నారు. మంగళవారం మండలంలోని పొట్టపెల్లి(కె) గ్రామంలోని ప్రతి ఇంటింటికీ వెళ్లి ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్ ఆధ్వర్యంలో సర్వే చేశారు. మరుగుదొడ్ల వినియోగం గురించి ఆరా తీశారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు ప్రాముఖ్యతనివ్వాలని ఎంపీపీ అన్నారు. ప్రతి ఇంటిలో మరుగుదొడ్ల నిర్మాణం జరగడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం స్వచ్ఛ భారత్ అమలు, విజయవంతం చేయుటకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్, ఎంపీఓ నసీరుద్దీన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యవతి, ఐకేపీ ఏపీఓ వాణిశ్రీ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, మండల పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

బేలలో దివ్యాంగుల కోసం బస్సు పాస్ మేళా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దివ్యాంగుల కొరకు బుధవారం బేల మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు ఆదిలాబాద్ డిపో మేనేజర్ కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 రుసుము చెల్లించాలని, ఒక పాస్ పోర్ట్ ఫొటో, ఆధార్ కార్డు జిరాక్స్, సదరం సర్టిఫికెట్ తీసుకొని రావాలని పేర్కొన్నారు. నూతనంగా దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ తీసుకున్నవారు, గతంలో తీసుకున్న గడువు అయిపోయిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి
- కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి
- అభివృద్ధిని ప్రతి గడపకూ తీసుకెళ్లాలి



నవతెలంగాణ-నిర్మల్

దేశంలో మరే రాష్ట్రంలో లేని అభివృద్ధి, సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో అమలవుతున్నాయని, ఉమ్మడి పాలనలో వెనుకబాటుకు గురైన తెలంగాణ ప్రాంతం ఇప్పుడు అన్ని రంగాల్లో ముందంజలో ఉందని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్మల్ పట్టణ బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా హాజరై మంత్రి మాట్లాడారు. రైతుల కోసం అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశంలో మరే ఇతర రాష్ట్రంలోనూ అమలు కావడం లేదన్నారు. పొరుగు రాష్ట్రాలు సైతం తెలంగాణ పథకాలు, పాలన వైపు చూస్తున్నాయని అన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత నిర్మల్ జిల్లా కేంద్రంలో విద్య, వైద్య రంగాల్లో గణనీయమైన ప్రగతి సాధించగలిగామని అన్నారు. దేవాదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తను రెండవ సారి ఎమ్మెల్యేగా గెలవరని ప్రతిపక్షాలు విమర్శించాయని, అయినా సీఎం కేసీఆర్ సహకారంతో, దేవుని ఆశిస్సులతో, ప్రజల దీవెనతో మళ్లీ ఎమ్మెల్యేగా గెలిచి రెండవ సారి దేవాదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి, జిల్లాలో అనేక ఆలయాలను అభివృద్ధికి కృషి చేస్తున్నానని తెలిపారు. నిరంతరం రాష్ట్ర అభివృద్ధి కోసం పరితపిస్తున్న కేసీఆర్‌ను మనమంతా మరోసారి ఆశీర్వదించాలని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని అన్నారు. ప్రతిపక్షాల మాటలను తిప్పికొట్టాలని అన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ తీసుకెళ్లాలని అన్నారు. ప్రజలతో పథకాలపై చర్చిస్తూ వారిలో చైతన్యం తీసుకురావాలని కోరారు. సీఎం కేసీఆర్ 9 ఏండ్ల పాలనలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలిపారని అన్నారు. 8 ఏండ్లుగా కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందని, ఇచ్చిన మాటకు కట్టుబడి బీజేపీ పాలన చేసిందా అని ప్రశ్నించారు. నల్లధనం తీసుకువచ్చి ప్రతిఒక్కరి అకౌంట్లలో రూ.15లక్షలు వేస్తానని ప్రధాని మోదీ చెప్పారని, ఎవరికైనా వేశారా అని ప్రశ్నించారు. అదే విధంగా నల్లధనాన్ని అరికట్టేందుకు పెద్ద నోట్లను రద్దు చేశారని, నల్లధనం అరికట్టడం ఏమో గాని సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్న తప్పుపట్టారు. ఇవన్ని చాలవన్నట్లు పెట్రోల్, డీజిల్ ధరలను విపరీతంగా పెంచారని, రూ.400 ఉన్న వంటగ్యాస్ సిలిండర్ ధరను రూ.1200లకు పెంచారని మండిపడ్డారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నల కడుపు కొట్టింది మోడీ ప్రభుత్వం కాదా అని నిలదీశారు. ఇలా ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్రం ప్రభుత్వ ప్రజావ్యతిరేఖ విధానాలను సీఎం కేసీఆర్ ఎండగడుతున్నందుకే ఇటు తెలంగాణను అటు సీఎం కేసీఆర్ కుటుంబ సభ్యులపై కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇదంతా చేస్తూ ఏ ముఖం పెట్టుకొని తెలంగాణలో జెండా పట్టుకొని తిరుగుతారని బీజేపీ నాయకులను ఉద్దేశించి మంత్రి ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేఖ విధానాలను తిప్పికొట్టాలని అన్నారు. ఎన్నికల సమయంలో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జిల్లా బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ గంగాధర్‌గౌడ్, మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, ప్రజాప్రతినిధులు, పట్టణ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
బుధవారం 12 మార్చి 2023

ఎంపీని కలిసిన ఎన్‌హెచ్-63 బాధితులు

నవతెలంగాణ-హాజీపూర్



గుడిపేట్ గ్రామానికి చెందిన ఎన్‌హెచ్ 63 బాధితులు మంగళవారం మంచిర్యాలలో పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేతను కలిసి వినతి పత్రం అందజేశారు. రోడ్డుకు ఇరువైపులా భూసేకరణ చేయాలని, ప్రభుత్వ మార్కెట్ ధర కాకుండా ప్రస్తుత మార్కెట్ వాల్యూ ప్రకారం నష్టపరిహారం చెల్లించేలా చూడాలని ఎంపీని కోరారు. మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ శ్రీనివాస్‌రావు, దొమ్మటి సత్తయ్య, శంకర్, కందుల రమేష్, బొడ్డు మల్లేష్ పాల్గొన్నారు.

దహెగాం అధ్యాపకుడికి ఘన సన్మానం

నవతెలంగాణ-దహెగాం



మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న నోముల చంద్రశేఖర్‌ను శ్రీశ్రీ కళావేదిక, ఇందాని చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో ఘనంగా సన్మానించారు. నోముల చంద్రశేఖర్ అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తూనే కవిగా, ఆధ్యాత్మిక వ్యాసకర్తగా, తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ధర్మాచార్యులుగా పనిచేస్తుండడంతో ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్న సందర్భంగా ఆయన కవిత్వాన్ని మెచ్చుకొని సన్మానించారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని బురుగుడా గ్రామంలోని బీసీ కాలనిలో నాలుగు రూ.లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు మంగళవారం బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, జడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు అరిగెల నాగేశ్వరరావు, ఎంపీపీ అరిగెల మల్లికార్జున్‌లు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత గ్రామాల అభివృద్ధి ఎంతగానో జరుగుతుందన్నారు. కాలనీలో త్వరలోనే రూ.ఐదు లక్షలు నిధులతో డ్రైనేజీ పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. జాతీయ రహదారి ఇరువైపుల డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు సర్వీస్ రోడ్డు యూటర్న్ లాంటి అవసరాన్ని గ్రామస్తులు వివరించగా వెంటనే హైవే అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు చౌదరి మాధవి, బూసి భీమేష్, పెద్దపల్లి శ్రీనివాస్, ఎంపీటీసీ కాల్వ రమేష్, ఉపసర్పంచ్ బుజాడి కుమార్, వార్డు సభ్యులు సప్తే నిర్మల, చంద్రగిరి శ్రీనివాస్, నాయకులు సుంకరి పెంటయ్య, సప్తే బాలకిషన్, మనిగొండ వెంకటేష్, ఉప్పరి ప్రభాకర్, బోయిరె ప్రకాష్, బావాజీ, రమేష్, సాయి ఓమాజి, గురుమూర్తి పాల్గొన్నారు.

వంద శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని మున్సిపల్ పరిధిలో నిర్దేశించిన పన్నుల వసూలు లక్ష్యాన్ని వంద శాతం వసూలు చేసేందుకు అధికారులు కార్యచరణ రూపొందించి అమలు చేయాలని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ సూచించారు. మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయితో కలిసి మున్సిపల్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలక సంఘం పరిధిలో నిర్దేశించిన ఇంటి పన్నుల వసూలు లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించాలని తెలిపారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రతినిత్యం ప్రతి ఇంటి నుంచి తడి పొడి చెత్తను వేరువేరుగా సేకరించి డంపింగ్ యార్డుకు తరలించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని నర్సరీ నిర్వహణ సక్రమంగా ఉండాలని, మొక్కల పరిరక్షణపై శ్రద్ధ వహించాలని, వైకుంఠధామాల నిర్మాణ పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేటాయించిన విధుల పట్ల నిర్లక్ష్యం, అలసత్వం వహించిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, పట్టణ ప్రణాళిక, పారిశుద్యం, నర్సరీ అధికారులు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల్లో తెలంగాణ దేశానికి ఆదర్శం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సంక్షేమ పథకాల అమల్లో తెలంగాణ దేశానికి ఆదర్శమని జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని అంకుశపూర్, గొల్లగూడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బండి మల్లయ్య తన అనుచరులతో మంగళవారం ఎంపీపీ మల్లికార్జున్ సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని అన్నారు. అనేకమంది సంక్షేమ పథకాలకు ఆకర్శితులై పార్టీలోకి వస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు బలరాం, రవీందర్, మల్లేష్, కుమార్ పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులకు పరిష్కారం చూపాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సత్వర పరిష్కారం చూపాలని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. మంగళవారం జిల్లా ఎస్పీ సురేష్ కుమార్‌తో కలిసి ఎస్సీ, ఎస్టీ చట్టం కింద నమోదైన కేసులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా, మండల, గ్రామస్థాయిలో పౌర హక్కుల దినోత్సవం జరిపి చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పథకాల అమలుపై మానిటరింగ్ కమిటీ సభ్యులు అధికారులతో కలిసి పర్యవేక్షించాలని తెలిపారు. పౌర హక్కుల దినోత్సవం నిర్వహించేందుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ పోలీస్ సబ్ డివిజన్ల పరిధిలో నమోదైన కేసులపై సమీక్షించి త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓఆ రాజేశ్వర్, డీఎస్పీ లు శ్రీనివాస్, కరుణాకర్, దళిత అభివృద్ధి జిల్లా అధికారి సావిత్రి, కార్పొరేషన్ ఈడీ సజీవన్, మానిటరింగ్ కమిటీ సభ్యులు రేగుంట కేశవరావు, మౌల్కర్ అశోక్, గోపాల్ నాయక్, వెంకటేష్, గణేష్ పాల్గొన్నారు.

వీఓఏల భవిష్యత్ కార్యాచరణ

నవతెలంగాణ-కౌటాల



మండలకేంద్రంలోని ఆరె సంక్షేమ సంఘం ప్రాంగణంలో మంగళవారం వీఓఏలు భవిష్యత్ కార్యాచరణపై సమావేశం నిర్వహించారు. ఇందులో కౌటాల, సిర్పూర్(టి), కాగజ్‌నగర్, చింతలమానెపెల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్ మండలాలకు చెందిన వీఓఏలు పాల్గొని చర్చించుకున్నారు. ఈ నెల 17న జరిగే నిరవధిక సమ్మెలో జిల్లా ఐకేపీ వీఓఏలు అన్ని మండలాల్లో సమ్మె నిర్వహించాలని సీఐటీయూ జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా గౌరవధ్యక్షుడు జాదవ్ రాజేందర్, ఐకేపీ వీఓఏల ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు జ్యోతి, జిల్లా నాయకులు వెలిశాల కృష్ణమాచారి పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో సెర్ప్ సంస్థలో గత 20 ఏండ్లుగా గ్రామీణస్థాయిలో 17965 మంది వీఓఏలు పనిచేస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే పేద నిరుపేద మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగడానికి ఎంతో కృషి చేస్తున్నారని, వీరికి అన్ని రకాల రుణాలు ఇప్పించడం, అన్ని బ్యాంకులకు సక్రమంగా కట్టించడం చేస్తున్నారన్నారు. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగభద్రత కల్పించి కనీస వేతనం నిర్ణయించి అమలుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీఓఏల సమస్యల పరిష్కారానికి చేపట్టే సమ్మెలో మహిళా సంఘాలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని, ప్రభుత్వం స్పందించకుంటే నిరవధిక సమ్మెకు సిద్ధంగా కావాలన్నారు.

డీడీలు తీసి పశువైద్యాధికారికి ఇవ్వాలి

నవతెలంగాణ-కోటపల్లి

గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా రెండవ విడతలో డీడీలు తియ్యని వారు డీడీలు తీసుకొని మండల పశు వైద్య అధికారిని సంప్రదించాలని తెలంగాణ రాష్ట్ర గొర్రెల, మేకల పెంపకం వృత్తి దారుల సంఘం అధ్యక్షుడు కొమ్ము అశోక్ యాదవ్ అన్నారు. మండలంలోని సుద్దాల గ్రామంలో మంగళవారం ఆ సంఘం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో దూసుకెళుతోందన్నారు. గొర్రెలు మేకలు ఏ ప్రభుత్వం ఇచ్చిన పాపాన పోలేదని స్వరాష్ట్రం సాధించుకున్నకా కేసీఆర్ పరిపాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు కట్టవెన రవి పాల్గొన్నారు.

ఫూలే జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శం

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్
- ఘనంగా జ్యోతిబాపూలే 196వ జయంతి వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



దేశంలోని ప్రతి ఒక్కరికి జ్యోతిబాపులే ఆదర్శమని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జ్యోతిబాపూలే 196వ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆత్రం సక్కు హజరయ్యారు. ఈ సందర్భంగా బాపులే చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళ్లు అర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నేటి సమాజంలోని విద్యార్థులకు జ్యోతిబాపులే ఆదర్శప్రాయుడన్నారు. సమాజంలో కులవివక్ష అత్యధికంగా ఉండి మగ వారి పెత్తనం నడుస్తున్న రోజుల్లో తన బార్యకు స్వయంగా చదువు నేర్పించాడని కొనియాడారు. అలాగే సమాజంలో స్త్రీలు విద్య నేర్వాలనే తపనతో మొట్టమొదటి బాలికల విద్య కొరకు ఉద్దేశించిన పాఠశాలను ప్రారంభించాడన్నారు. దేశంలో తన వ్యక్తిత్వంతో మహాత్మ అని పిలిపించుకొన్న గొప్ప ఆశయాలు ఉన్న వ్యక్తి పూలే అని కొనియాడారు. అంతకుముందు ఆదిలాబాద్ చౌరస్తా నుండి మాలి కులస్తులు బైక్ ర్యాలీ ద్వారా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయి, రాజేశం, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి సత్యనారాయణరెడ్డి, జడ్పీటీసీ నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్, అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు బాపు జాడే పాల్గొన్నారు.

కేవీపీఎస్ ఆధ్వర్యంలో

వేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం దినకర్ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిబాపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమములో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు జాడి మల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు తాల్లపల్లి నితిన్, మహేశ్వర్ జిల్లా నాయకులు సెండే శ్రీరామ్, ఉట్ల రవి కుమార్, పస్తం ఆనంద్, జాడి రామయ్య, సెండే మోహన్ పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదిలాబాద్ ఎక్స్ రోడ్డు వద్ద జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ గాదవేణి మల్లేష్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేష్, బీసీ సంక్షేమ సంఘం రైతు అధ్యక్షుడు మారుతి పటేల్, లవ్ కుమార్, మాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుర్నులే మారుతి, నాయకులు నాయకులు తులసిరాం, బాబురావు, శ్రీకాంత్, నారాయణ పటేల్, శివ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కోటపల్లి : మహాత్మా జ్యోతి బాపూలే జయంతి సందర్భంగా మంగళవారం చెన్నూర్ పట్టణ కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్ పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ఉన్నారు.

కాగజ్‌నగర్ రూరల్ : మండలంలోని రాస్పెల్లి గ్రామంలో మమాత్మ జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా మంగళవారం సావిత్రి బాయిపూలే దంపతుల విగ్రహాలను జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి, జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావుతో కలిసి ఆవిష్కరించారు. ఆ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘననివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చీపురుశెట్టి శంకరయ్య, రాస్పెల్లి సర్పంచ్ బొమ్మెల పద్మకిషన్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు సిద్దిక్, బీఆర్ఎస్ యువజన విభాగం మండలాధ్యక్షుడు ఇనుముల ఉమేష్ పాల్గొన్నారు.

వివిధ సంఘాల ఆధ్వర్యంలో

మండలంలోని చింతగూడ గ్రామంలో జ్యోతి బాపులే జయంతి నిర్వహించారు. చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్ళర్పించారు. సర్పంచి ఆత్రం సంజీవ్, మండల కోఆప్షన్ సభ్యుడు బాబా, మాజీ ఎంపీటీసీ నికూరె నాగేందర్, మోర్లె నాందేవ్, లెండుగురె పోచయ్య, బాబురావు, చంద్రయ్య తిరుపతి పాల్గొన్నారు. పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో కోసిని గ్రామంలోని జ్యోతి బాపూలే జయంతి సందర్భంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబాపూలే ఘన నివాళ్లు అర్పించారు.

మంచిర్యాల : తెలంగాణ బీసీ జాగృతి ఆధ్వర్యంలో పట్టణంలో మహాత్మా జ్యోతిబాపూలే 196 జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జడ్పీ వైస్ చైర్మన్ తోంగల సత్యనారాయణ మునిసిపల్ వైస్ చైర్మన్ ముఖేష్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె భూమేష్, మహిళా నాయకురాలు అత్తి సరోజలు పాల్గొని పూలే చిత్ర పటానికి పూలమాలవేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో జాగృతి జిల్లా అధ్యక్షులు నరెడ్ల శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మూగల మహేష్, పట్టణ అధ్యక్షుడు వైద్య భాస్కర్ ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి లక్ష్మణ్ పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో

టీఎస్ యుటిఎఫ్ నాయకులు మంగళవారం జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా ఘననివాళ్లు అర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల రాజావేణు, జిల్లా కోశాధికారి బి.కిరణ్, మండలం అధ్యక్ష, కార్యదర్శులు బారిక్‌రావు, వాహిద్, భీమారం మండలం అధ్యక్షులు కైలాసం, కోటపల్లి మండలం ప్రధాన కార్యదర్శి తిరుపతి పాల్గొన్నారు.

భీమిని : మండలంలోని ఖర్జిభీంపూర్ గ్రామంలో మంగళవారం మహాత్మ జ్యోతిబాపూలే జయంతి వేడుకలను మాలీ సంక్షేమ సంఘం అధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదే చెంద్రుమేర, అదే వసంత్‌రావు, పెటుకులే హనుమంతు, పెటుకులే శ్రీనివాస్, కొట్రాంగ్ భీంరావు, వడఈ సుధాకర్, వడఈ రాములు, వడాఈ రమేష్, మదుకర్, మహేష్, పి.రాజయ్య నాందేవ్ పాల్గొన్నారు.

జన్నారం : మండంలో మహాత్మ జ్యోతిబాపూలే జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. తిమ్మాపూర్ గ్రామంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు జాడి గంగాధర్, అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు సీటిమల్ల భరత్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకులు బోర్లకుంట ప్రభుదాస్, తాళ్లపల్లి రాజేశ్వర్, బీసీ సంఘం నాయకులు కోడూరు చంద్రయ్య, కడారుల నరసయ్య, ముత్యం సతీష్, మామిడిపెల్లి ఇందయ్యా, రత్నం మాణిక్యం, కొండపల్లి ప్రశాంత్ పాల్గొన్నారు..

కెరమెరి : మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను కొనసాగిస్తామని ఎంపీపీ పెందూర్ మోతీరాం, జడ్పిటీసీ సెడ్మకి ద్రుపత బాయి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద మాలీ సంఘం ఆధ్వర్యంలో పూలే 196 జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షుడు జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాథోడ్ బయన బాయి, ఉత్తం నాయక్, మాలీ సంఘం నాయకులు నారాయణ్, సుధాకర్, బిక్కు, ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకటేష్ పాల్గొన్నారు.

వాంకిడి : మండలకేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో మహాత్మా జ్యోతిపూలే జయంతిని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని లంజన్‌వీర గ్రామానికి వెళ్లే రహదారిలో గల జ్యోతిబాపులే విగ్రహానికి మాలీ సంఘం మండలాధ్యక్షుడు బాపురావు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, మాలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కాసిపేట : మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో మహాత్మ జ్యోతిబాపూలే 196వ జయంతిని మంగళవారం సామాజిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొని మహాత్మ జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం మండల ప్రధాన కార్యదర్శి రాజేంద్ర చార్యులు, ముత్యం పల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు చింతోజు ప్రభాకర్ చార్యులు, ప్రధాన కార్యదర్శి శిరోజూ శ్రీనివాసాచార్యులు, పట్టణ కోశాధికారి సిలోజు నరసింహ చార్యులు, కార్యవర్గ సభ్యులు కంచి శంకరాచార్యులు, తుడుం దెబ్బ మండల ప్రధాన కార్యదర్శి మడవి వెంకటేష్, నాయక్ పోడ్ సేవా సంఘం సాంస్కృతిక కార్యదర్శి రెడ్డి లక్ష్మణ్ పాల్గొన్నారు.

బెజ్జూర్ : మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే మహనీయుల అడుగుజాడల్లో మాలీ కులస్తులందరు నడవాలని, ఎస్టీ హోదా కోసం చేయాలని మాలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదె వసంత్‌రావు అన్నారు. మంగళవారం మహాత్మా జ్యోతిబాపూలే జయంతిని పురస్కరించుకొని మండలకేంద్రంలోని జ్యోతిబాపూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి హనుమంతు, జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ, ఆసిఫాబాద్ డివిజన్ అధ్యక్షుడు మెంగాజీ, బెజ్జూర్ మాలీ సంఘం అధ్యక్షుడు ఆదె అశోక్, మాలీ సంఘం యూత్ అధ్యక్షుడు సురేష్, నాయకులు బాబురావు, భీమన్న, వెంకటి, మోహన్, వసంత్, గోపాల్ పాల్గొన్నారు.

కౌటాల : మండలకేంద్రంలోని బుద్ధివిహార్‌లో మహాత్మా జ్యోతిబాపూలే జయంతిలో భాగంగా ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పసునూరి తిరుపతి, బీఆర్ఎస్ యువజన సంఘం మండలాధ్యక్షుడు తాళ్లపెల్లి రవీందర్‌గౌడ్, నాయకులు డబ్బ బాపు, బండి శ్రీనివాస్, భిట్టుపెల్లి సంతోష్, బసార్కర్ అశోక్, భీంరావు, ముడిమడుగుల శంకర్, విఠల్ పాల్గొన్నారు.

రెబ్బెన : మండలంలోని పారిశ్రామిక ప్రాంతమైన గోలేటి టౌన్‌షిప్‌లో సామాజిక తత్వవేత్త, అనగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిబాపూలే 196వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఆజ్మీర బాబురావు మాజీ ఎంపీటీసీ మద్దెల సురేందర్‌రాజు, సీపీఐ మండల కార్యదర్శి దుర్గం రవీందర్, నాయకులు కస్తూరి రవి పాల్గొన్నారు.



కోటపల్లి



కాగజ్‌నగర్ రూరల్



మంచిర్యాల



కౌటాల

ప్రభుత్వ పథకాలు వివరించాలి

- అసత్య ప్రచారాలు చేస్తే తగిన బుద్ధి చెప్పాలి
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్

నవతెలంగాణ-కోటపల్లి



బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ సూచించారు. మంగళవారం చెన్నూర్ పట్టణంలోని సంతోషి మాతా ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ విధి విధానాలపై కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. గడిచిన 50 ఏండ్లలో ఎన్నడూ లేని విధంగా చెన్నూర్‌ను అభివృద్ధి చేశామన్నారు. కాంగ్రెస్ గత 50 సంవత్సరాల నుంచి అధికారంలో ఉండి చెన్నూర్ నియోజక వర్గానికి చేసిందేమీ లేదని విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉండి మన రాష్ట్రానికి రావలసిన నిధులను కూడా ఇవ్వడం లేదని మండిపడ్డారు. నిధులు ఇవ్వక పోగా అభివృద్ధిలో అడ్డుపడుతోందన్నారు. కేంద్రం నిధులు ఇవ్వక పోయినా చెన్నూర్ నియోజక వర్గాన్ని రాష్ట్ర నిధులతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు అబివద్దికి సహకరించకుండా అభివృద్ధి చేస్తున్న వారిపై అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలలో అబద్రత భావాన్ని కల్పిస్తున్నారని విమర్శించారు. 2014 తరువాత కేసీఆర్ నాయకత్వంలో ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో చెన్నూర్ నియోజకవర్గంలో నూతన ఒరవడి నెలకొందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత, ఎమ్మెల్సీ దండే విఠల్, జడ్పీ చైర్పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్ పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం బహిష్కరణ

- నూతన పంచాయతీ ఏర్పాటును వెనక్కి తీసుకోవాలని డిమాండ్



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని వందురుగూడ గ్రామపంచాయతీలో మంగళవారం నిర్వహించే కంటివెలు శిబిరాన్ని గ్రామస్తులు బహిష్కరించారు. అధికారులు కంటి వెలుగు శిబిరాన్ని ఏర్పాటు చేసేందుకు వెళ్లగా గిరిజనులు అడ్డుకొని వైద్యులను, అధికారులను వెనక్కి పంపారు. ఈ సందర్భంగా గ్రామ పటేల్, తెలంగాణ ఆదివాసి సేన రాష్ట్ర అధ్యక్షుడు దౌలత్‌రావు మాట్లాడుతూ తమకు ఇష్టం లేకుండా నూతన పంచాయతీ ఏర్పాటు చేసి ఆదివాసుల అస్తిత్వాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. పాత పంచాయతీలో తమ గిరిజనగూడాన్ని కలిపే వరకు ఎటువంటి అధికారిక కార్యక్రమాలు జరగనీయమని ఆయన అన్నారు. తమ గూడెంలో ఎటువంటి అభివృద్ధి పనులు జరగకుండా నిధులు ఖర్చు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని నిరసనలు వ్యక్తం చేసిన అధికారులు ఉన్నతాధికారులకు తప్పుడు నివేదికలు పంపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండా గ్రామంలో ఎటువంటి అభివృద్ధి పనులు చేయరాదని నిధులు మళ్లించరాదని ఆయన అన్నారు. గ్రామపంచాయతీ ఏర్పడినప్పటి నుండి ఎటువంటి అభివృద్ధి జరగలేదని ఆయన తెలిపారు. ఆదివాసి చట్టాలను అనుసరించి ఆదివాసులకు న్యాయం జరిగేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఎంపీడీఓ మల్లేశం నచ్చచెప్పే ప్రయత్నం చేసిన వారు వినలేదు. దీంతో అధికారులు చేసేదేమి లేక వెనుతిరిగి వెళ్లిపోయారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ టేకం భీంరావు, ఆదివాసీ గిరిజన నాయకులు సిడం రాము పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు అభినందనీయం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయటం అభినందనీయమని ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్ అన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుకుదేవ్‌ల 92వ వర్ధంతి సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రిలో మార్చి31న ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి సంబంధించి యువతకు ప్రశంస పత్రాలు కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి 17 యూనిట్ల రక్తదానం ప్రభుత్వ ఆసుపత్రికి ఇవ్వడం అభినందనీయమన్నారు. జిల్లాలో రక్తహీనతతో అనేకమంది బాధపడుతున్నారని ఇటువంటి కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరిడెంట్ స్వామి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, జిల్లా సహా కార్యదర్శిలు దుర్గం రాజ్‌కుమార్, గెడం టీకానంద్, జిల్లా ఉపాధ్యక్షులు చాపిడి పురుషోత్తం, దుర్గం నిఖిల్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, జిల్లా నాయకులు గోగర్ల ఆకాష్, శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

కోమటిచేనులో సీసీ కెమెరాలు ఏర్పాటు

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని కోమటిచేను గ్రామంలో రాంటెంకి అన్వేష్ మూడు సీసీ కెమెరాలను స్వచ్ఛందంగా ఏర్పాటు చేయటంతో కాసిపేట ఎస్సై గంగారాం అభినందించారు. ఈ సందర్భంగా మంగళవారం గ్రామంలో ఆ కెమరాలను ఎస్సై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై గంగారాం మాట్లాడుతూ ప్రతి గ్రామంలో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా 24 గంటలు నిఘాలో ఉండడం వల్ల ఎటువంటి నేరం జరిగినా వెంటనే గుర్తించి వారికి శిక్ష పడేటట్లు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాంటెంకి శ్రీనివాస్ ఉన్నారు.

జర్నలిస్టులకు దళిత బంధు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలి

నవతెలంగాణ- మంచిర్యాల

జిల్లా కేంద్రంలో వివిధ పత్రికలు, టీవీ ఛానల్‌లో విధులు నిర్వహిస్తున్న దళిత జర్నలిస్టులకు దళిత బంధుతో పాటు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని కోరుతూ మంగళవారం జిల్లా కలెక్టర్‌కు దళిత జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. పత్రిక రంగంలో ఏళ్ల తరబడి పనిచేస్తూ ఎటువంటి ఆర్థిక స్తోమత లేక ఉపాధి అవకాశాలు లేక నిస్వార్థంగా సామాజిక సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దళిత బంధు పథకాన్ని దళిత జర్నలిస్టులకు కూడా వర్తింపజేసి ప్రత్యేకంగా అమలు చేయాలని కోరారు. ఇండ్ల స్థలం లేక అద్దె భవనాల్లో ఉంటున్న జర్నలిస్టులకు డబుల్ బెడ్‌రూమ్‌లు కేటాయించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో దళిత జర్నలిస్టు సంఘం జిల్లా అధ్యక్షులు ఒరగంటి సత్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల శ్రీధర్, జిల్లా కోశాధికారి కొండ శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పులేటి రవి, సంతోష్ రాజు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి చేయాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని సిర్పూర్ పేపర్ మిల్ జనరల్ మేనేజర్ ఎంఎస్ గిరి అన్నారు. ఎస్పీఎం స్వర్ణ ఫౌండేషన్, సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఎస్పీఎం ట్రైనింగ్ సెంటర్‌లో ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం అనేక అనారోగ్యాలకు దారి తీస్తుందని అన్నారు. అనంతరం ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిద్దామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మిల్లు చీఫ్ మేనేజర్ రమేష్‌రావు, సీసీఈ ప్రాజెక్టు అధికారి విద్యాభూషణ్, మిల్లు ప్రతినిధి తుమ్మ రమేష్ పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం

నవతెలంగాణ

www.navatelangana.com

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల

కుమురం భీం-ఆసిఫాబాద్

4

బుధవారం 12 ఏప్రిల్ 2023

జనసురక్ష పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

జనసురక్ష పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ నసీరుద్దీన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని ప్రతీ గ్రామంలో వివిధ బ్యాంకుల ఆధ్వర్యంలో ఈ నెల 24 నుండి వచ్చే నెల 15 వరకు జన సురక్ష పథకంపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై పథకలను ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకునేలా, బ్యాంకు సిబ్బందికి సహకరించేలా ఆయా గ్రామల సర్పంచ్‌లు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల నుండి వచ్చే నెల వరకు విడతల వారీగా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ పేర్కొన్నారు.

ఇంటి నెంబర్లు కేటాయించరెందుకు?

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్



మున్సిపల్ పరిధిలోని బంగారుగూడలో పేదల ఇళ్లకు ఇంటి నెంబర్లను ఎందుకు కేటాయించడం లేదని బిజెపి జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ కమిషనర్ శైలజను నిలదీశారు. మంగళవారం ప్రజావాణిలో బంగారిగూడ బిజెపి కౌన్సిలర్ లోగిటి శ్రీనివాస్ కాలనీవాసులతో కలిసి మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. బంగారిగూడ పేదల ఇళ్ల విషయంలో మున్సిపల్ అధికారులకు అనేక పర్యాయాలు విన్నవించుకున్నా పట్టించుకోకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కమిషనర్ శంకర్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఒక దశలో పోలీసులు కలుగజేసుకొని ఇరువురిని సముదాయించారు. వినతిపత్రం ఇచ్చి అక్కడ నుంచి వెళ్లిపోవాలని పోలీసులు సూచించడంతో నాటకీయ పరిణామాల అనంతరం వివాదం సద్దుమణిగింది. బంగారుగూడ ప్రజల సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనలను పార్టీ ఆధ్వర్యంలో ఉధృతం చేస్తామని శంకర్ హెచ్చరించారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

నవతెలంగాణ-తాంసి

భీంపూర్ మండలం నిపాని గ్రామానికి చెందిన సర్పంచ్ భూమన్న దొర కుటుంబానికి పార్టీ సభ్యత్వ ఇన్సూరెన్స్ కింద మంజూరైన రూ.2లక్షల చెక్కును మంగళవారం ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అందించారు. కొన్ని నెలల క్రితం భూమన్న దొర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. పార్టీ సభ్యత్వం కలిగి ఉన్న ఆయనకు పార్టీ అండగా నిలిచిందని ఈ సందర్భంగా రాథోడ్ బాపురావు పేర్కొన్నారు. కార్యకర్తలకు బీఆర్ఎస్ ప్రభుత్వం నిలబడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నాగయ్య యాదవ్, వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్న, తాంసి ఎంపీపీ మంజల శ్రీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షులు కౌడాల మహేందర్, సంతోష్, అనిల్, గోవర్ధన్ యాదవ్, వెంకన్న, జాదవ్ గణేష్, అబ్దుల్లా పాల్గొన్నారు.

మౌళిక వసతులు కల్పించాలి

- పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణలో పలువురి డిమాండ్

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ డివిజన్‌లోని రెండు భూగర్భ గనులకు మంగళవారం కృష్ణకాలనీ శాంతి మైదానంలో పర్యావరణంపై ప్రజాభిప్రాయ సేకరణలో రోడ్లు, రవాణా, లైటింగ్, మంచినీటి వసతులు కల్పించాలని పలువురు డిమాండ్ చేశారు. ప్రజాభిప్రాయ సేకరణను అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, తెలంగాణ స్టేట్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఇంజనీర్ లక్ష్మణ్ ప్రసాద్ సమక్షంలో నిర్వహించారు. శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో టీబీజీకేఎస్, ఏఐటీయూసీ, సీఐటీయూ, బిఎంఎస్, హెచ్ఎంఎస్, టిఎన్టియుసి నాయకులు, మున్సిపల్ చైర్మన్, ప్రభావిత ప్రాంతాలైన నస్పూర్, తాళ్లపల్లి, సింగపూర్, రామారావు పేట, ప్రజా ప్రతినిధులు, మేధావులు, ప్రజలు పాల్గొని గని నిర్దేశించిన లక్ష్యానికి ఎక్కువ ఉత్పత్తి తీసినందుకుగాను పర్యావరణ పరిరక్షణపై తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఆర్ పి 3,3ఏ గని 1988లో ఏర్పడిందని, ప్రస్తుతం గని అనుమతికి మించి అధికంగా ఉత్పత్తి చేసినందుకు ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నట్లు తెలిపారు. 1993లో ఏర్పాటు చేసిన ఆర్కే8 గని 2020 అక్టోబర్ 10న మూసేశారని, కానీ 2017 ప్రకారం అప్పటినుంచి తీసిన బొగ్గుకు పర్యావరణ అనుమతి తీసుకోనందున నిబంధనల ప్రకారం గని మూసివేసిన కూడా కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు పర్యావరణ కాలుష్యంపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. గనిలో అధిక ఉత్పత్తి తీసినందుకు ప్రజాభిప్రాయ సేకరణలో పర్యావరణ పరిరక్షణ కమిటీ అనుమతులు ఇవ్వాలని పలువురు డిమాండ్ చేశారు. కానీ శ్రీరాంపూర్ ఏరియాలోని కాలనీలో నీరు సరిగ్గా రావడం లేదని కార్మికవాడల్లో మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎస్ ఆర్ పి3 గని నుండి రాయల్ టాకీస్ వరకు వెళ్లే దారిలో పూర్తిగా అంధకారం ఉందని రోడ్డు నిర్మాణం చేసి లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. పర్యావరణం కలుషితం కాకుండా సింగరేణి ఆధ్వర్యంలో వేల మొక్కలను నాటడం హర్షనీయమని తెలిపారు. సింగరేణి ప్రాంతాల్లో చిల్డ్రన్ పార్కులను ఏర్పాటు చేయాలని, కార్మికులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు ఈ కార్యక్రమంలో ఆర్డిఓ వేణు, టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రావు, ఏరియా ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ)రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, ఏరియా కార్యదర్శి గోదారి భాగ్యరాజు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీతారామయ్య, ఉప ప్రధాన కార్యదర్శి బాజీసైదా, సెంట్రల్ కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బిఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేష్, హెచ్ఎంఎస్ నాయకులు జీవన్ జోయల్, ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మానందం, ఐఎన్టీయూసీ నాయకులు, మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.



వృద్ధాశ్రమానికి మాలి మహా సంఘం విరాళం



నవతెలంగాణ-తలమడుగు

ప్రముఖ సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిబాపూలే 196వ జయంతిని పురస్కరించుకొని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర, జిల్లా కమిటీల ఆధ్వర్యంలో మంగళవారం లింగి వృద్ధాశ్రమానికి రూ.35 వేల విలువైన వంట పాత్రలు, ఎల్ఈడీ టీవీ, రెండు కార్పెట్లను బహూకరించారు. ఈ సందర్భంగా అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే మాట్లాడుతూ జ్యోతిరావు పూలే దంపతుల స్ఫూర్తితో మాలి మహా సంఘం అనేక సేవా కార్యక్రమాలలో పాలుపంచుకుంటూ తమ సామాజిక బాధ్యతను నెరవేరుస్తూ, సామాజిక న్యాయం కోసం అనేక పోరాటాలు చేస్తుందని అన్నారు. ఇదే స్ఫూర్తిని మాలి యువత, మాలి సంఘం పెద్దలు, మాలి కులస్తులు కొనసాగించాలని అన్నారు. బహుజనలంతా ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాలి మహా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న షిండే, జిల్లా పటేళ్ల సంఘం అధ్యక్షులు గంగారాం శేండే, కార్యవర్గ సభ్యులు రామ్ కిషన్ షిండే, గజానన్ టాకిరే, నందు లేనగురే, మహిళా సంఘ సభ్యులు కల్పన పెట్కులే, మనిషా గురునులే, గంగుతాయి షిండే పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలి

- నిర్మల్ కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

పట్టణ అభివృద్ధి కోసం పాలకవర్గ సభ్యులందరూ ఏకతాటిపై ఉండి ముందుకు సాగాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన అత్యవసర సమావేశానికి హాజరై పలు అంశాలను చర్చించారు. కొత్తగా ఏర్పడిన పురపాలక సంఘం కావడంతో వనరులు తక్కువగా ఉంటాయని, ఈ క్రమంలో ఆదాయం వచ్చే మార్గాలపై దృష్టి సారించాలన్నారు. ప్రతి సమావేశానికి తాను గాని అదనపు కలెక్టర్ గాని తప్పకుండా వస్తామని చెప్పారు. పర్వదినాలైన అంబేద్కర్ జయంతి కార్యక్రమానికి రూ.25 వేలు, రంజాన్ పండుగకు ఈద్గాలు, ప్రార్థనా మందరిరాల వద్ద మూళిక వసతులకోసం రూ.60వేలు, బస్టాండ్ ప్రాంతంలో చలివేంద్రం ఏర్పాటు కోసం రూ.20వేలు, శ్రీరాంనగర్‌లో ఓపెన్ జిమ్ కోసం రూ.5లక్షలు, డబుల్ రూం నివాస ప్రాంతంలో జిమ్ కోసం రూ.6 లక్షలు, వేసవిలో ఎదురయ్యే తాగునీటి ఎద్దడి నివారణ తదితర 15 అంశాలను కలెక్టర్ సమక్షంలో తీర్మానించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్, వైస్ చైర్మెన్ అబ్దుల్ ఖలీల్, ఫ్లోర్ లీడర్ చిన్న సత్యం, తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీఓ మల్లేశం, కమిషనర్ చిక్యాల రత్నాకర్‌రావ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణ పనుల పరిశీలన



నవతెలంగాణ-నిర్మల్

నూతన సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను కలెక్టర్ వరుణ్ రెడ్డి, అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి మంగళవారం పరిశీలించారు. సీఎం కేసీఆర్ చేతుల మీదుగా నిర్మల్ సమీకృత కలెక్టరేట్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. అధునాతన సౌకర్యాలు, సకల హంగులతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవన సముదాయాన్ని ఈ నెలలో ప్రారంభోత్సవం చేయనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి అన్ని గదులలో ఏర్పాట్లను పరిశీలిస్తూ, అధికారులకు తగు సూచనలు, సలహాలు చేశారు. ప్రాంగణంలో గార్డెనింగ్, మొక్కలు నాటడం సుందరీకరణ పనులు త్వరితగితన పూర్తి చేయాలని, బార్డర్ ప్లాంటేషన్ చేయాలని అన్నారు. ఆహ్లాదకరమైన పచ్చని వాతావరణం కల్పించేలా మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని అన్నారు. వాహనాల పార్కింగ్, హెలిప్యాడ్, పరిశీలించి, నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-బజార్‌హత్నూర్



మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ జయశ్రీ అధ్యక్షతన వాడీవేడిగా జరిగింది. ఈ సర్వసభ్య సమావేశానికి అధికారులు, సభ్యులు హాజరయ్యారు. ముందుగా సమాశంలో అధికారులు తమ శాఖల పరిధిలో జరిగిన అభివృద్ధి ప్రగతి నివేదికను చదివి వినిపించారు. మిషన్ భగీరథ అధికారులపై సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో భగీరథ ఇంటింటికీ బిగించకపోవడంతో నీళ్లు రోడ్లపై పారుతున్నాయని సర్పంచ్‌లు మండిపడ్డారు. అధికారులు పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గంగాపూర్ సర్పంచ్ శ్రీరామ్ మండిపడ్డాడు. ఉపాధి హామీ కూలీలు ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డును లింక్ చేసుకోవాలని ఏపీవో శ్రీనివాస్ తెలిపారు. జూన్ 30 వరకు చివరి తేదీ ఉందని లింక్ చేయకపోతే కూలీలు ఉపాధి పనులకు అనుమతి లభించదని ఆధార్ లింకుతో బ్యాంకు అనుసంధానం చేయడం జరుగుతుందని అన్నారు. రైతులకు ఉపయోగపడే పనులను ల్యాండ్ డెవలప్‌మెంట్, హరితహారం వంటి పనులను చేయడం జరుగుతుందని తెలిపారు. ఉపాధి హామీ చట్టంలో ఆయిల్ ఫామ్, అర్టికల్చర్ ఏర్పాటు చేసుకునే రైతులు ముందుకు రావాలని తెలిపారు. మొక్కల ట్రాన్స్‌పోటేషన్ బిల్లు రాలేవని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అనేకసార్లు అడిగిన పట్టించుకోవడంలేదని తెలిపారు. మొక్కల పెంపకంపై ఒత్తిడి చేస్తున్నారని కనీసం బిల్లులు ఇవ్వడం లేదని పలువురు సర్పంచ్‌లు వాపోయారు. ట్రాన్స్‌పోటేషన్ బిల్లులు జిల్లాలో ఎక్కడ కూడా రాలేదని, సైట్ ఓపెన్ అవగానే పేమెంట్లు చేస్తామని ఏపీఓ తెలిపారు. సీడీపీఓ మాట్లాడుతూ ప్రస్తుతం అంగన్‌వాడీ 8 గంటల నుండి 12 గంటల వరకు ఉంటుందని తెలిపారు. గత 7 సంవత్సరాల నుండి అంగన్‌వాడీ ఖాళీలను భర్తీ చేయడం లేదని సర్పంచ్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య, ఎంపీడీఓ చౌహాన్ రాధ, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

తాగునీటిని అందించలేని దుస్థితిలో ప్రభుత్వం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజల దాహార్తిని తీర్చేందుకు కంది శ్రీనివాసరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంకర్లను ఎంపీ సోయం బాపురావు మంగళవారం ప్రారంభించారు. కాలనీవాసులకు నీటిని అందించారు. కంది శ్రీనివాసరెడ్డి చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలను ఆయన అభినందించారు. కనీసం తాగునీటిని కూడా అందించలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వముందని ఎంపీ ఘాటుగా విమర్శించారు. రానున్నది బీజేపీ ప్రభుత్వమేనని, ప్రజలకు మంచి రోజులు రానున్నాయని అన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ వస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అధికారంలోకి ఇన్నేండ్లయినా కాలనీల్లో కనీస మౌలిక వసతులు కల్పించడంలో ఎమ్మెల్యే జోగు రామన్న, ఆయన కుమారుడు జోగు ప్రేమేందర్ విఫలమయ్యారని అన్నారు. వారి చేతకాని తనం వల్లే ప్రజలు ఇన్ని అవస్థలు పడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి వైఫల్యాలను తీవ్రస్థాయిలో ఎండగట్టారు. ఆదిలాబాద్ అభివృద్ధే తన లక్ష్యమని, ప్రజల సంక్షేమం కోసం శక్తివంచన లేకుండా కృషిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెంబి జెడ్పీటీసీ జానుబాయి, దక్షిణమధ్య రైల్వే బోర్డు మెంబర్ జీవీ.రమణ, నాయకులు చిత్రు, సంతోష్ సింగ్ ఠాకూర్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే కులవృత్తులకు పూర్వవైభవం



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

కుల వృత్తులకు పూర్వ వైభవం తీసుకువచ్చే దిశగా బీఆర్ఎస్ ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. మంగళవారం స్థానిక కైలాస్‌నగర్‌లో ఏర్పాటు చేసిన పట్టణ నాయి బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకర మహోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను శాలువా, పూలమాలలతో సత్కరించి, అభినందనలు తెలియజేశారు. సంఘం సభ్యులు ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించారు. అనంతరం పలువురు సభ్యులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జనాభాలో 52 శాతం ఉన్న బీసీలు అన్ని రంగాల్లో ముందుండేలా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ అమలు చేస్తోందని అన్నారు. తాను బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో అన్ని పార్టీల నాయకులతో సమావేశాలు ఏర్పాటు చేసి బీసీల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు వెల్లడించారు. ముఖ్యంగా కుల వృత్తులకు తగిన ప్రోత్సాహం అందిస్తూ ఆర్థికంగా ఎదిగేలా పలు కార్యక్రమాలను అమలు చేశామని పేర్కొన్నారు. సంఘం సభ్యులు ప్రస్తావించిన సమస్యల సాధనకు తన వంతుగా పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్, నాయకులు రాము, మెట్టు ప్రహ్లాద్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కుటుంబాన్ని ప్రతి కార్యకర్త పటిష్టం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ప్రతి ఒక కార్యకర్త బీఆర్ఎస్ కుటుంబాన్ని పటిష్టం చేయాలని, గ్రామ కమిటీలు గ్రామాలలో చురుకుగా అభివృద్ధి సంక్షేమ పథకాలను తీసుకెళ్లి దిశా నిర్దేశం చేయాలని ఎమ్మెల్యే జోగు రామన్న సూచించారు. మంళవారం గ్రామీణ మండలంలోని ఖండాల గ్రామ పంచాయతి పరిధిలోని పోతగూడలో నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల పరిధిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలు, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఇంటింటికి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు చేరుతున్న నేపథ్యంలో ఆ విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ కుమ్ర విజయలక్ష్మి రాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మెట్టు ప్రహ్లాద్, ఆత్మ చైర్మెన్ జిట్ట రమేష్. ఎంపీపీ గండ్రత్ రమేష్, వైస్ ఎంపీపీ జంగు పటేల్, పీఏసీఎస్ చైర్మెన్ పరమేశ్వర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ గంగయ్య, బీఆర్ఎస్ నాయకులు రమణ, సేవ్వ జగదీష్ యాదవ్, సర్పంచ్‌లు అశోక్, కిషన్, చందు, సుభాష్, భూమన్న సురేష్. ఆయా గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

యువత పూలేను ఆదర్శంగా తీసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్



నేటి యువత పూలేను ఆదర్శంగా తీసుకోవాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. మంగళవారం మహాత్మ జ్యోతిరావు పూలే 197వ జయంతి సందర్భంగా పట్టణంలోని బీసీ స్టడీ సర్కిల్ ఆవరణలో ఉన్న పూలే విగ్రహానికి కొవ్వొత్తులు వెలిగించి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆత్మస్థైర్యం కల్పించి, వారి హక్కుల కోసం పోరాడిన మహనీయుడు మహాత్మా జ్యోతి బాపూలే అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీడీడబ్ల్యూఓ రాజలింగు, అఖిల భారతీయ మాలి మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పేట్కులే, అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటి అధ్యక్షులు దుర్గం శేఖర్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్ భరత్, బీసీ సంఘం పట్టణ అధ్యక్షులు దాసరి రమేష్ పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్ : సామాజిక ఉద్యమ పితామహుడు అన్ని వర్గాల ప్రజల ఆశాజ్యోతి సంఘసంస్కర్త దేశంలో మనుషులందరూ సమానమేనని చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి మహాత్మ జ్యోతిబాపూలే 196వ జయంతి వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు బత్తినీ సుధాకర్ మాట్లాడుతూ ఆయన చేసిన సామాజిక సేవలు మరవలేనివని, చరిత్రలో నిలిచిన మహనీయుల జ్ఞాపకాలు చారిత్రక విషయాలను ప్రస్తుత యువత తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ నారది లింగన్న, సామాజిక కార్యకర్త సంతోష్, సర్పంచ్ ప్రకాష్, గ్రామ యువకులు నరేందర్, సురేష్, అలిమ్ ఖాన్ పాల్గొన్నారు.